క్లుప్తంగా

ఎంపీడీఓగా సాయికృష్ణ



కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండల పరిషత్ అధికారిగా సాయికృష్ణ బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇంత వరకు సూపరింటెండ్ ప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. గ్రూప్–1 అధికారి సాయికృష్ణ శిక్షణ పూర్తి చేసుకోవడంతో ఉన్నతాధికారులు కొలిమిగుండ్ల ఎంపీడీఓగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సాయికృష్ణకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి మౌలాలి స్వాముల ఉరుసు



కొండపేటలో వెలిసిన హసన్‌వలీ, మౌలాలి స్వాముల దర్గా

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటకు చెందిన దివంగత ఏఈ గోవిందప్ప గౌడ్ స్థలంలో వెలసిన శ్రీ హజరత్ హసన్‌వలి, మౌలాలి స్వాముల ఉరుసు మహోత్సవాలు మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఎస్‌ఏ చిన్న రహిమాన్ తెలిపారు. 24వ తేదీన గంధం , 25న ఉరుసు, 26వ తేదీన కిస్తీతో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయన్నారు.

శాకాహా రం అమృతాహారం

సంజామల: శాకాహారం అమృతాహారమని పిరమిడ్ మాస్టర్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రం సంజామలలో సుబ్రహ్మణ్యేశ్వర ధ్యాన మందిరం నుంచి బస్టాండ్ వరకు మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లడుతూ ప్రతి ఒక్కరూ శాకాహరిగా మారాలని, అప్పుడే సంపూర్ణ ఆరగ్యోం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల పిరమిడ్ మాస్టర్స్ రవీంద్ర రెడ్డి, శ్రీనువాసులు, రాజమ్మ, సామిత్రి, వెంకట నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత



చెక్కును అందజేస్తున్న నీలి శ్రీనివాసులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని తమ్మడపల్లె గ్రామానికి చెందిన రైతు మద్ది శీలయ్య(36) మే 21న పిడుగుపడి మృతి చెందారు. ఈ మేరకు సహకార పరపతి సంఘం తరుపును మంజూరైన రూ. 2 లక్షల బీమా చెక్కును బుధవారం సంఘం స్థానిక కార్యాలయంలో మృతుడి భార్య మద్ది గొల్ల లక్ష్మీదేవికి భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ నీలిశ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ అబ్దుల్ మునాఫ్, ఏఈఓ షామీర్, మధు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్రగా అయ్యప్పలు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన అయ్యప్ప మాలధారులు ప్రసాద్, జగదీశ్వర్ రెడ్డి, రమేష్, శివ స్వాములు ఇరుముడులతో శబరి మలకు పాదయాత్రగా బయలు దేరారు. ముందుగా నంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప స్వామి, మాళిక పురోత్తమ్మలకు గురుస్వాములు చిన్ని కృష్ణ, మధు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారులకు భిక్ష ప్రారంభించారు.

నేటి నుంచి వినియోగదారుల మాసోత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న జడ్జి కిషోర్‌కుమార్

డోన్ టౌన్ : వినియోగదారుల మాసోత్సవాలు ఈ నెల 23 నుంచి డిసెంబర్ 24వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు మాసోత్సవాల పోస్టర్లను బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి కిషోర్ కుమార్ విడుదల చేశారు. వస్తు సేవల్లో ఇబ్బంది కలిగినప్పుడు వినియోగదారులు కోర్టులో ఎలా ఫిర్యాదు చేయాలని... తదితర అంశాలను వివరిస్తూ పోస్టర్లు రూపొందించామని ఈ సందర్భంగా సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు వివరించారు. కార్యక్రమంలోసంఘం కన్వీనర్ కంభాలపాడు ధనుంజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాజ్ఞాన యజ్ఞం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం శ్రీకృష్ణ మందిరంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సర్వ సౌభాగ్య దేవీత్రయ గీతా మహాజ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యజ్ఞానికి ఏర్పేడు శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతులు పరిపూర్ణానందగిరిస్వాములు హాజరవుతున్నారు. మూడు రోజుల పాటు గణపతి పూజ, అఖండ దీపారాధన, కలష స్థాపన తదితర విశేష పూజలు జరుగుతాయన్నారు. చివరి రోజు 25వ తేదీన రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం, పరిపూర్ణానందస్వామి వారి భగవద్గీత ఉపన్యాసం ఉంటుందన్నారు.



భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత



దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ నేతలకు క్రేన్ సాయంతో గజమాల వేస్తున్న దృశ్యం

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- బనగానపల్లె నియోజకర్గంలో రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- నాలుగున్నరేళ్లలో 4.96 లక్షల మందికి రూ. 1,186 కోట్ల లబ్ధి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో నిర్వహించిన సామాజిక బస్సుయాత్ర ఉత్సాహంగా సాగింది. ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణం కిటకిటలాడింది. బస్సుయాత్ర సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. దేశానికి స్వాతంత్రం లభించి 76 సంవత్సరాలు కావస్తున్నా రాష్ట్రంలో ఏ నాడు జరగని అభివృద్ధి ప్రస్తుత జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో డీబీటీ ద్వారా రూ. 2లక్షల 40వేల కోట్లు, నాన్‌డీబీటీ ద్వారా రూ. లక్షా 70వేల కోట్లు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. బనగానపల్లె నియోజక వర్గంలో నాలుగున్నరేళ్లలో 4.96 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ. 1186 కోట్ల మేర లబ్ధి చేకూరిందని, అదేవిధంగా సుమారు 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. బనగానపల్లె పట్టణంలో రూ. 22 కోట్లతో వంద పడకల ఏరియా ఆసుపత్రి, రూ. 16 కోట్లతో బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణాల్లో ఫోర్‌లైన్ల ఏర్పాటుతోపాటు బనగానపల్లెలో సెంట్రల్ లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా వంద కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. రూ. 150 కోట్లతో నాడు– నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జలకళ పథకం ద్వారా రైతులకు వ్యవసాయ బోర్లు వేయడంతోపాటు కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. బనగానపల్లె పట్టణంలో రూ. 80లక్షలతో స్మశాన వాటికకు ప్రహారీ ఏర్పాటు చేశామన్నారు. సొంత నిధులు రూ. 30 లక్షలతో ఈద్గాకు ప్రహారీ ఏర్పాటు చేశామని, అదేవిధంగా షియా మతస్తుల కోసం మసీదును నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితమే రూ. 3 కోట్లు విలువైన స్థలంలో పట్టణంలో ముస్లింలు శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా రూ. 1.30 కోట్లతో షాధీఖానా ఏర్పాటుకు భూమి పూజ చేశామన్నారు. రూ. 5 కోట్ల విలువ చేసే స్థలంలో కార్పెంటర్లకు షెడ్లు ఏర్పాటు చేసి వారికి జీవనోపాధి కల్పించినట్లు పేర్కొన్నారు.

పేదలపై మాజీ ఎమ్మెల్యే బీసీకి ప్రేమలేదు

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి పేదలపై ఏ మాత్రం ప్రేమ లేదని, వారికి మంచి జరిగితే ఓర్వలేరని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, యువ నాయకుడు కాటసాని ఓబుళరెడ్డి ధ్వజమెత్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యే కాటసాని బనగానపల్లెను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తుంటే బీసీ ఓర్వలేకపోతున్నారని, కుట్రలు పన్నుతూ అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి ప్రజలకు తెలుస్తున్నా బీసీ జనార్ధన్‌రెడ్డికి మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. బనగానపల్లె పట్టణంలో పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీకి ఎమ్మెల్యే సర్వం సిద్ధం చేయగా మాజీ ఎమ్మెల్యే బీసీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్న విషయం ప్రజలకు తెలుసన్నారు. అన్ని విషయాలు గమనిస్తున్న ప్రజలు 2024 ఎన్నికల్లో బీసీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, గుండం శేషిరెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి, సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అబ్దుల్ ఫైజ్, అబ్దుల్ ఖైర్, డాక్టర్ మహమ్మద్ ఉసేన్, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు చల్లా శ్రీలక్ష్మి, లక్ష్మి సుబ్బమ్మ, సూర్యనారాయణరెడ్డి, బీవీ నాగార్జునరెడ్డి, మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పోచా శీలారెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, అంబటి గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు



బీసీ నేతలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, తదితర నేతలు

బనగానపల్లె గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సుభాష్ చంద్రబోస్

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె గ్రంథాలయ శాఖలో రికార్డులను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మద్దూరు సుభాష్‌చంద్రబోస్ బుధవారం తనిఖీ చేశారు. గ్రంథాలయానికి ప్రతిరోజు ఎంత మంది పాఠకులు సందర్శిస్తుంటారు... అందుబాటులో ఉన్న పుస్తకాలు తదితర వివరాలను గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సమస్యపై ఆరా తీశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, పెద్దలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మద్దూరు సుభాష్ చంద్రబోస్ సూచించారు.

జాతీయ పోటీలకు శృతికీర్తన

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శృతి కీర్తన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఈ మేరకు బుధవారం హెచ్‌ఎం నారాయణమ్మ, వ్యాయామ ఉపాధాయుడు హరి, ఉపాధ్యాయులు శృతి కీర్తనకు అభినందనలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు హరి మాట్లాడుతూ ఈ నెల 16–21వతేదీ వరకు మిడుతూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ అండర్–14 విభాగంలో శృతికీర్తన పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో ఛతీష్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరుపున మా విద్యార్థిని పాల్గొంటుందని హరి తెలిపారు.

రూ.6.80కోట్లతో మౌలిక వసతులు



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని మారుమూల ప్రాంతాలకు సైతం మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం 20వ వార్డులో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని 32 వార్డులలో స్పెషల్ గ్రాంట్ కింద రూ.6.40కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపట్టామన్నారు. ఫిబ్రవరి నాటికి పట్టణంలో తాగునీటి సమస్య పూర్తిగా నివారించేందుకు గోరుకల్లు రిజర్వాయర్ నుండి వాటర్‌గ్రిడ్ కింద మంచినీటి సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, కౌన్సిలర్లు సాధిక్, షేక్ ఇంతియాజ్, మల్లికార్జునరెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈ సురేష్, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, కాలేషా, తిరుపతయ్య, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

కోవెలకుంట్ల: హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై విద్యార్థులు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్వీబీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఎయిడ్స్ నివారణ చర్యలపై ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్‌ఎసీఓ–డీఏపీసీయూ సమన్వయ కర్త వర్ధనాచారి మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రచారాన్ని విస్తృతం చేయలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, క్విజ్, రీల్‌మేకింగ్, డ్రామా వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాక్ సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి, నాగేశ్వర రెడ్డి, డాక్టర్ రాజు, డాక్టర్ లక్ష్మీదేవి, అన్నపూర్ణ, క్రిష్ణదాస్, డాక్టర్ రాజశేఖర్, నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర



శోభా యాత్రలో పాల్గొన్న సభ్యులు

డోన్ టౌన్ : అయోధ్యలో శ్రీ బలరాముని అభిషేకించిన పవిత్ర అక్షతలు(అక్షింతలు) బుధవారం డోన్ పట్టణంకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ డోన్ విభాగపు అధ్యక్షులు రామా రాజేష్ ఆధ్వర్యంలో సభ్యులు పాతపేట రాములదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి అక్షతలను శోభా యాత్రగా భజనల మధ్య పాతబస్టాండ్ మీదుగా శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు నిర్వహించారు. అనంతరం పూజలు నిర్వహించి భక్తులకు పంచి పెట్టారు.

బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని పలక చింత మాను ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయోధ్య శ్రీరామ అక్షంతల కళశాన్ని బుధవారం పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ముందుగా పలక చింత మాను ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంఘాల సభ్యులు గుండా గోపాలు, బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాగ మోహన్, అయ్యప్ప, భవాని మాలధారులు పాల్గొన్నారు.

ప్యాపిలి: అయోధ్యలో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణం పూర్తవుతున్న సందర్భంగా బాల రాముడిని అభిషేకించిన అక్షతలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి అంకాళపరమేశ్వరీ ఆలయం వరకు శోభా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్యాపిలి అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కార్యదర్శి సురేశ్ కుమార్, భజరంగ్‌దళ్ సంయోజక్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తిం



కొలుములపల్లెలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బుగ్గన



కలచట్ల గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హతనే ప్రామాణికంగా పేదలందరికీ వర్తింపజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని కొలుములపల్లెలో ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ మరియమ్మ ఆధ్వర్యంలో బుధవారం పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఎంపీపీ, చైర్మన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కొలుములపల్లె అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 34 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు గూని నాగరాజు, కృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, బ్రహ్మేశ్వర్‌రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, బుజ్జన్న, భాస్కర్, తిమ్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ప్యాపిలి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో జలదుర్గం సర్పంచ్ దస్తగిరి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, బాలాంజి, రామ్మూర్తి, నాగరాజు, తులసిరెడ్డి, రామాంజి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభాలపాడు హైవే సర్కిల్, తారకరామనగర్, శ్రీనివాసనగర్, టీచర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్, శ్రీరామనగర్, నెహ్రూనగర్ తదితర కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

బొడ్రాయికి పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ జరిగి ఐదేళ్లు అయిన సందర్భంగా గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు శాంతి, ఓం శివ, మహేష్, బండి కుమార్, రామాంజి హైమావతి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు బొడ్రాయి దగ్గర లక్ష్మీగణపతి, నవగ్రహ, చండీ, మృత్యుంజయ హోమాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి

డోన్ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో చేపట్టనున్న మహా ధర్నాలో కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగమద్దయ్య పిలుపునిచ్చారు. స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో బుధవారం మహాధర్నాకు సంబంధించిన కర పత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండన్న, కొయిలకొండ నాగరాజు,నక్కి శ్రీకాంత్,భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములమ్మ, వాల్మీకి మహర్షి విగ్రహాల ప్రతిష్ఠ



వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న వాల్మీకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లులో గ్రామ దేవత రాములమ్మ, వాల్మీకి మహర్షి విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాతం కాలపూజ, సర్వతోభద్ర, యంత్రాభిషకం, దీక్షా హోమం, ప్రధాన హోమములు, జపములు, బలిహరణం అనంతరం యంత్ర ప్రతిష్ఠ శ్రీరాములమ్మ, వాల్మీకి విగ్రహాల ప్రతిష్ఠ చేశారు.

దళితులకు అండగా బీజేపీ

డోన్ టౌన్ : దళితులకు బీజేపీ అండగా నిలుస్తుందని, ఎస్సీ వర్గీకరణ కూడా ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన భుజస్కందాలపై వేసుకున్నారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురష్కరించుకొని రాష్ట్ర పర్యటన చేపట్టిన ఆయన బుధవారం డోన్ పట్టణం చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి ఆయన పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ డోన్ అంసెబ్లీ కన్వీనర్ సందు రమణ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు భరణి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజ్, కార్యవర్గ సభ్యులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సమర్థవంతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు నిర్వహిచిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఈనెల 27 నుంచి సమగ్ర కులగణన ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, ఆస్థి వివరాలు సేకరించి వారి అనుమతితోనే సంబంధిత మొబైల్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గణితావధాని సంజీవరావు శర్మకు నివాళి

డోన్ టౌన్ : పుట్టుకతోనే గుడ్డి, చదువులేని వ్యక్తి కేవలం వినికిడి ద్వారానే గణితంలో ఆరువేల అవధానాలు చేసిన ఏకైక వ్యక్తి, రాయలసీమ వాసి సంజీవరావు శర్మ అని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శర్మ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక పాతపేట హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కల్లూరులో 1907 నవంబరు 22న శర్మ జన్మించారన్నారు. పుట్టుకతోనే గుడ్డివాడైన ఆయన అక్క స్కూల్లో విన్న పాఠాలను ఇంటి దగ్గర వచ్చి బిగ్గరగా చెప్పడంతో విని గణితంలో పట్టు సాధించి గణితావధానిగా ఎదిగారని కొనియడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సుబ్బారెడ్డి, మధుసూదనరెడ్డి, రవిశేఖర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.